చినుకుపడితే చీకటే..



ఉమ్మడి మండలంలోని గ్రామాలకు సరఫరా చేసే విద్యుత్ సబ్‌స్టేషన్

- మహమ్మదాబాద్ మండలంలో అంధకారంలో పలు గ్రామాలు
- పాత విద్యుత్‌లైనుతో అవస్థలు
- లూప్‌లైన్ చెట్ల తాకిడితో గంటల తరబడి విద్యుత్ సరఫరాలో అంతరాయం



చెట్లకు తాకుతున్న పుట్టాపహాడ్ నుండి సరఫరా చేసే 11కేవీ లైన్

మహమ్మదాబాద్: చినుకు పడిందంటే చాలు ఆ గ్రామాలు రాత్రనక పగలనక అంధకారంలోకి వెళ్లాల్సిందే. దాదాపు 50ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన 11కేవీ విద్యుత్‌లైన్, ఇన్సూలేటర్లు పాతబడి అతుకుల బొంతగా మారి నిత్యం మరమ్మతులు చేస్తుండడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు.

అస్తవ్యస్తంగా విద్యుత్ సరఫరా..

మండలంలోని పలు గ్రామాలకు కూతవేటు దూరంలో కుల్కచెర్ల మండలం పుట్టాపహాడ్‌లో 133కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ ఉంది. అక్కడి నుంచి మండలంలోని గాధిర్యాల్, జగ్గంపల్లి, బోయగుడిసెలు, ఎన్కిచెరువుతండా, గువ్వోనికుంటతండా, బోరింగ్, మదిరెమీది తండాలకు, వ్యవసాయానికి పుట్టాపహాడ్ విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి 11కేవీ లైన్ ద్వారా విద్యుత్ సరఫరా అవుతుంది. ఈ గ్రామాలకు 55ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన ఇనుప స్తంభాలు ఉన్నాయి. లూప్ ఎక్కువ కావడంతో 10ఏళ్ల క్రితం మధ్య మధ్యలో స్తంభాలు వేసి పాతవైర్లనే పగిలిన ఇన్సూలెటర్లనే సరిచేసి వదిలేశారు. విద్యుత్ పునరుద్ధరణ ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టినా లూప్‌లైన్ లేకుండా కొత్తవైర్లు అమర్చి లైన్‌కు చెట్లు తాకకుండా బ్రేకర్లు అమర్చి లైన్ కటింగ్ ఏర్పాటు చేయలేదు. లూప్‌లైన్‌తో చెట్లకుతాకుతూ గంటల తరబడి తీవ్ర విద్యుత్ సమస్యలతో అవస్థలు పడుతున్నారు. కరెంట్ పోయిందంటే చాలు వందలాదిమంది ఫోన్లు చేసినా రాత్రివేళలో సిబ్బంది అప్పటికప్పుడే స్పందన తప్ప శాశ్వత పరిష్కారం చేసిన పాపాన పోలేదంటున్నారు. గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అనుకూలంగా ప్రతి కాలనీకి ఓ విద్యుత్ బుడ్డిని ఏర్పాటు చేశారు. కాని అలాంటి బుడ్డి కాలిపోతే మాత్రం దాన్ని పక్కన పెట్టి రెండు, మూడు కాలనీలు ఒకే బుడ్డీకి తగిలించడంతో లోడు ఎక్కువై ఫ్యూజులు, జంపర్లు నిలబడని పరిస్థితి ఏర్పడింది. ఒక్క గాధిర్యాల్‌లో అలా నాలుగైదు బుడ్డీలను వృథాగా పడేశారు.



గాధిరాల్యలో అస్తవ్యస్తంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు

నిత్యం అంతరాయమే..



కూతవేటు దూరంలో 133కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ ఉన్నా లాభంలేదు. గాలివాన వచ్చి చినుకు పడిందంటే వైర్లు తెగాయంటూ, చెట్లు విరిగిపడ్డాయంటూ, ఫ్యూజులు ఎగిరాయంటూ గంటల తరబడి కరెంట్ రాక అవస్థలు పడాల్సిందే. ఐదారు గంటలు కోతలే ఉంటున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు గమనించి విద్యుత్ లైను పునరుద్ధరించాలి.

– శ్రీనివాస్, బోరింగ్‌తండా

సమస్య తీర్చాలి..



పుట్టాపహాడ్ నుంచి విద్యుత్‌లైను వైర్లు, ఇన్సులేటర్లు తుప్పుపట్టి చాలా సంవత్సరాలు గడుస్తుంది. ఎండ, వర్షాలకు తెగినా, పగిలిపోయినా అతుకులు వేస్తున్నారు తప్పా కొత్త లైను ఏర్పాటు చేసి సమస్యను తీర్చుదామని అధికారులు ఆలోచించలేదు. గ్రామాల్లో విద్యుత్ పునరుద్ధరణకు సమయం కేటాయించి రూ.లక్షలు ఖర్చు చేస్తున్నా ఫలితం లేకపోయింది. ఇప్పటికానా 11కేవీ లైను వెంటనే మార్చి సమస్యను తీర్చాలి.

– రాఘవేందర్‌రెడ్డి, గాధిర్యాల్

త్వరలో 11కేవీ లైన్ పునరుద్ధరణ..

పుట్టాపహాడ్ నుంచి ఉమ్మడి గండేడ్ మండలంలోని ఆయా గ్రామాలకు సరఫరా అవుతున్న లైన్ సమస్యలున్న విషయం మా దృష్టికి వచ్చింది. వెంటనే లూప్‌లైన్ పోల్స్ ఏర్పాటు చేసి కొత్తవైర్లు అమర్చి చెట్లు తాకకుండా ఏర్పాట్లు చేస్తున్నాం. అందుకు ఆయా పంచాయతీలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా ప్రజల సమస్యలు తీర్చేందుకు చర్యలు తీసుకుంటాం.

– సత్యం, ఏఈ, మహమ్మదాబాద్

బడిబయటి పిల్లలను బడిలో చేర్పించాలి

కోయిల్‌కొండ: మండలంలోని బడిఈడు పిల్లలను తప్పనిసరిగా బడికి పంపించాలని మండల ప్రత్యేకాధికారి మధుసుదన్‌గౌడ్, ఏఎంఓ శ్రీనివాస్ అన్నారు. గురువారం మండలంలోని పారుపల్లిలో బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించారు. గ్రామంలో అధికారులు, పిల్లల తల్లిదండ్రులతో కలిసి విధుల గుండా ర్యాలీ తీశారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యతోపాటు విద్యార్థులకు ఉచితంగా యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనం వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కాళప్ప, ఎంఈఓ లక్ష్మణ్‌సింగ్‌నాయక్, సీఆర్‌పీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి చిన్నారిని బడికి పంపాలి

బాలానగర్: ప్రతి చిన్నారిని పాఠశాలకు పంపాలని పనిపేరుతో చదువుకు దూరం చేయరాదని ఉపాధ్యాయుడు నారాయణ అన్నారు. గురువారం మండల కేంద్రంలో బడిబాట కార్యక్రమాన్ని తోటి ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లతో కలిసి ప్రారంభించారు. ఉపాధ్యాయులు సరస్వతి, శంకర్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

మిడ్జిల్: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పించేందుకు ప్రభుత్వం గురువారం నుంచి బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించగా మండలంలో పలు పాఠశాలల్లో ఉపాధ్యాయులు కార్యక్రమం ఏర్పాటు చేశారు.

దేవరకద్ర: మండలంలో గురువారం బడిబాట ర్యాలీలు నిర్వహించారు. మండల కేంద్రంతో పాటు గూరకొండ, కోయిల్‌సాగర్, మీనుగోనిపల్లి, కౌకుంట్ల, పలు గ్రామాలలో బడిబాట కార్యక్రమం చేపట్టారు. మెరుగైన విద్యతో పాటు విద్యార్థులకు కావలసిన పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు ప్రభుత్వమే అందిస్తుందని తెలిపారు.



కోయిల్‌కొండలో బడిబాట ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు



బాలానగర్‌లో..



మిడ్జిల్‌లో..



దేవరకద్ర మండలం గూరకొండలో..

అధ్వానంగా కనకాపూర్ రోడ్డు



కనకాపూర్, అచ్చాయపల్లి మట్టిరోడ్డు

అడ్డాకుల: మూసాపేట మండలంలోని అచ్చాయపల్లి నుంచి కనకాపూర్‌తండా వరకు ఉన్న మట్టిరోడ్డు అధ్వానంగా మారింది. రోడ్డుపై గుంతలు ఏర్పడటంతో వాహనాలు వెళ్లడానికి ఇబ్బందులు కలుగుతున్నాయి. కొన్ని చోట్ల రోడ్డుకు ఇరువైపులా కంపచెట్లు పెరగడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదు. మరోవైపు రోడ్డు చిన్నగా ఉండటంతో రెండు వాహనాలు ఎదురెదురుగా వెళ్లడానికి వీలు కావడం లేదు. కనకాపూర్ తండావాసులు మూసాపేట మండల కేంద్రానికి వెళ్లడానికి ఇదే దగ్గరి దారి కావడంతో ద్విచక్రవాహనాలపై ఎక్కువగా రాకపోకలు సాగిస్తారు. వర్షాకాలంలో రోడ్డంతా బురదగా మారి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతాయి. అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

నేడు మార్కెట్‌లో లావాదేవీలు

దేవరకద్ర: స్థానిక మార్కెట్ యార్డులో శుక్రవారం యథావిధిగా లావాదేవీలు జరుగుతాయని అధికారులు తెలిపారు. గురువారం అమావాస్య కారణంగా మార్కెట్‌కు సెలవు ఇచ్చారు. దీని వల్ల లావాదేవీలు కాలేదు. శుక్రవారం మధ్యాహ్నం మార్కెట్‌లో టెండర్ల ప్రక్రియ కొనసాగుతుందని రైతులు తమ ధాన్యం తెచ్చి విక్రయించుకోవచ్చని పేర్కొన్నారు.

నిరుపయోగంగా బస్‌షెల్టర్లు

అడ్డాకుల: 44వ నంబర్ జాతీయ రహదారి పక్కన ప్రయాణికుల కోసం ఏర్పాటు చేసిన బస్‌షెల్టర్లు నిరుపయోగంగా మారుతున్నాయి. అడ్డాకుల, మూసాపేట మండలాల్లోని పలు స్టేజీల వద్ద దూరంగా వాటిని నిర్మించడంతో అవి వృథాగా దర్శనమిస్తున్నాయి. అడ్డాకుల మండలంలోని బలీదుపల్లి స్టేజి, శాఖాపూర్, మూసాపేట మండలంలోని వేముల స్టేజి, మూసాపేట, పోల్కంపల్లి స్టేజీల వద్ద బస్‌షెల్టర్లను నిర్మించినా అవి నిరుపయోగంగా మారాయి. కందూర్ స్టేజి వద్ద అడ్డాకుల వైపు బస్‌షెల్టర్ దూరంగా ఉంది. ఆయా స్టేజీల వద్ద ప్రయాణికులు బస్సులు, ఆటోల కోసం ప్రధాన రోడ్డుపైనే నిలబడుతున్నారు. దీనివల్ల ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోయిన ఘటనలు లేకపోలేదు. మరోవైపు కాటవరం, గుడిబండ, చక్రాపూర్, గాజులపేట, పొన్నకల్ స్టేజీ వద్ద అడ్డాకుల వైపు బస్‌షెల్టర్లను నిర్మించకపోవడంతో ప్రయాణికులు రోడ్లపైనే నిలబడాల్సి వస్తోంది. రహదారి నిర్వాహకులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.



బలీదుపల్లి స్టేజీ వద్ద దూరంగా ఉన్న బస్‌షెల్టర్

ఉపాధిహామీ రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలి



కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

నారాయణపేట: హైదరాబాద్‌లో ఉపాధిహామీ రక్షణ కోసం జూన్ 10న జరిగే ఉపాధి హామీ రాష్ట్ర సదస్సును జయప్రదం చేద్దామని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి వెంకట్రాములు పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కేంద్రంలో జరిగిన వ్యవసాయ కార్మిక సంఘం ముఖ్యకార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై సదస్సు కరపత్రాన్ని విడుదలచేసి మాట్లాడారు. హైదరాబాద్ సుందరయ్య కేంద్రంలో జరిగే సదస్సుకు రాష్ట్ర మంత్రి సీతక్క, వ్యవసాయ కార్మిక సంఘం అఖిల భారత కార్యదర్శి వెంకట్, రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు పాల్గొంటారని తెలిపారు. ఈ సదస్సుకు జిల్లాలోని ఉపాధి కూలీలు అధిక సంఖ్యలోపాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు గోపాల్, బాలప్ప, శివకుమార్, హన్మంతు, బీంపూర్, లాలప్ప, దేవప్ప, శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

దేవాలయంలో ప్రత్యేక పూజలు



బాలానగర్: పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయం వద్ద విశ్వబ్రాహ్మణులు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో హోమం నిర్వహించారు. బ్రహ్మంగారి ఆలయ నిర్మాణం చివరి దశలో ఉందని నిర్మాణానికి దాతలు సహకరించాలని వారు కోరారు.

కరపత్రం విడుదల

మహబూబ్‌నగర్ రూరల్: ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన మాదిగల జనసభ యాత్ర కరపత్రాలను స్థానిక ఎస్సీ కమ్యూనిటీహాల్‌లో మాదిగ జేఏసీ నాయకులు విడుదల చేశారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మెట్టు యాదయ్య, ఉపాధ్యక్షుడు గోపాలకృష్ణ, జిల్లా అధ్యక్షుడు బొర్ర సురేష్‌లు మాట్లాడుతూ యాత్ర శుక్రవారం జడ్చర్ల పట్టణంలోకి ప్రవేశిస్తుందని, ఈ సభకు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో దిలీప్ కుమార్, అరుణ్‌కుమార్, సుమన్, విజయ్‌కుమార్, విద్యాసాగర్, గోపాల్, చంద్రశేఖర్, అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

టీబీ వైద్య శిబిరం



రాజాపూర్: గ్రామాల్లో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రంగారెడ్డిగూడ మాజీ సర్పంచ్ జనంపల్లి శశికళారెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని రంగారెడ్డిగూడలో ఐసీఎంఆర్ ఆధ్వర్యంలో టీబీ క్యాంప్‌ను ఆమె ప్రారంభించారు. అనంతరం 60 మందికి ఎక్స్‌రేలు తీసి టీబీ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం లలిత, ఎంపీఓ వెంకట్‌రాములు, వీపీఓ లక్ష్మీనారాయణగౌడ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

969 జతల యూనిఫామ్స్ అప్పగింత



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల కోసం గురువారం మహిళా సంఘాల ఆధ్వర్యంలో కుట్టిన 969 జతల యూనిఫామ్స్ బస్తాలను ఎంఈఓ కార్యాలయంలో మెప్మా సిబ్బంది అందజేశారు. కార్యక్రమంలో సీఓలు యాదయ్య, దేవమ్మ, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు. కాగా, ఈనెల 1 నుంచి ఇప్పటివరకు 2,237 జతల యూనిఫామ్స్‌ను అప్పగించారు.

అన్నదానం

స్టేషన్ మహబూబ్‌నగర్: అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి ఆధ్వర్యంలో అమవాస్య సందర్భంగా గురువారం స్థానిక అశోక్‌టాకీస్ చౌరస్తాలో అన్నదానం నిర్వహించారు. సమితి ప్రతినిధులు మాట్లాడుతూ ప్రతినెల అమవాస్యను పురస్కరించుకొని దాతల సహకారంతో అన్నదానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సీమ నరేందర్, రామేశ్వర్, రాజశేఖర్, రఘు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీని సన్మానించిన మాజీ ఎమ్మెల్యే



దేవరకద్ర: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా స్థానిక సంస్థల ఉప ఎన్నికలలో బీఆర్‌ఎస్ పార్టీ నుంచి ఎమ్మెల్సీగా ఎన్నికైన నవీన్‌కుమార్‌ను దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి గురువారం ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. హైదరాబాద్‌లోని మాజీ ఎమ్మెల్యే ఆల నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసిన నవీన్‌కుమార్ దంపతులకు ఆల వెంకటేశ్వర్‌రెడ్డి దంపతులు శాలువాకప్పి సన్మానించారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

ఊట్కూరు: మండలంలోని మహిళా సమైక్య భవనంలో గురువారం ఎస్‌బీఐ బ్యాంక్‌వారి ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ మేరకు.. కౌన్సిలర్ షేక్ సుల్తానా వివిధ పథకాలపై అవగాహన కల్పించారు. సుకన్యసమృద్ధి యోజన, ఏపీవై, జేజేబీవై పథకాల గురించి వివరించారు. సైబర్‌నేరాలపై మోసపోవద్దని మహిళలకు సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం నిర్మల, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

గండేడ్: పాఠశాలల్లో చేపట్టిన పనులు పూర్తి చేయాలని ఎంపీడీఓ దేవన్న సూచించారు. గురువారం మండలంలోని పగిడ్యాల్, పంచాంగల్ తండా, మన్సూర్‌పల్లి, చెన్నాయిపల్లిలో అమ్మ ఆదర్శ పాఠశాలలో చేపడుతున్న పనులను పరిశీలించారు. దీంతో పాటు నర్సరీలను పరిశీలించారు. పర్యావరణ పరిరక్షణ దినోత్సవంలో భాగంగా ఉపాధి హామీ కూలీలతో పర్యావరణాన్ని పరిరక్షిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. తమ పిల్లలను ప్రభుత్వం బడుల్లోనే చదివించేలా చూడాలని ఎంఈఓ వెంకటయ్య పేర్కొన్నారు. మూతపడ్డ బడులన్ని తిరిగి తెరవడం జరుగుతుందని ఆయా గ్రామాల్లో తల్లిదండ్రులు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ హరిశ్చంద్రుడు పాల్గొన్నారు.



పగిడ్యాల్ పాఠశాలలో పనులు పరిశీలిస్తున్న అధికారులు

డీకే అరుణకు సన్మానం



డీకే అరుణను సన్మానించిన ప్రతినిధులు

స్టేషన్ మహబూబ్‌నగర్: మహబూనగర్ ఎంపీగా ఎన్నికైన డీకే అరుణను హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో పాలమూరు రెడ్డి సేవా సమితి ప్రతినిధులు సన్మానం చేశారు. కార్యక్రమంలో సమితి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు తూము ఇంద్రసేనారెడ్డి, ప్రధాన కార్యదర్శి వేపూరు రాజేందర్‌రెడ్డి, మల్లు నర్సింహారెడ్డి, వెంకట్రాంరెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి, కోటేశ్వర్‌రెడ్డి, పోతుల రాఘవరెడ్డి పాల్గొన్నారు.

పండ్ల తోటల సాగుకు రైతులను ప్రోత్సహించాలి

పాన్‌గల్: ఉపాధి హామీ పథకంలో పండ్ల తోటల పెంపకంపై రైతులకు అవగాహన పెంచి, ఎక్కువ మంది రైతులు పండ్ల తోటలు నాటుకునేలా చూడాలని ఎంపీఓ రఘురాములు, ఏపీఓ కుర్మయ్య సిబ్బందికి సూచించారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పండ్ల తోటలకు మంజూరైన రైతుల పొలాల్లో గుంతల తవ్వకం పనులను, ఫాంపాండ్ల ఏర్పాటు పనులను త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీంతో పాటు గ్రామాలకు నిర్దేశించిన మేరకు హరితహారం మొక్కలకు అనుగుణంగా గుంతల తవ్వాలన్నారు. ఉపాధి పనులకు వచ్చే కూలీల సంఖ్యను పెంచాలని సూచించారు. విధుల నిర్వహణలో అలసత్వం వహించే సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.



మాట్లాడుతున్న అధికారులు

భారీ వర్షంతో నిండిన కుంటలు



మల్లేపల్లి శివారులోని తిమ్మరెడ్డికుంటలోకి చేరుతున్న వర్షపునీరు

రాజాపూర్: మండల కేంద్రంతో పాటు మల్లేపల్లి, సోమ్లాతండా, యారోన్‌పల్లి, గుండ్లపొట్లపల్లిలో గురువారం భారీ వర్షం కురవడంతో అన్నదాతలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. రెండు రోజుల క్రితం కురిసిన వర్షంతో రైతులు విత్తుకునే పనిలో ఉన్నారు. గురువారం మధ్యాహ్నం కురిసిన వర్షంతో గ్రామాల శివారుల్లో ఉన్న కుంటలు, చెరువుల్లోకి వర్షపునీరు చేరుతోంది.

నవాబుపేట: మండలంలో రెండు రోజులుగా వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. గురువారం మధ్యాహ్నం వరకు ఎండ బాగా కాచింది. వెనువెంటనే దాదాపుగా రెండు గంటల పాటు భారీ వర్షం కురిసింది. దీంతో పొలాలన్ని జలమయం కాగా రోడ్లు సైతం కాల్వలను తలపించాయి.



లింగంపల్లి సమీపంలో పొలాల్లో పారుతున్న నీరు

పొంగిపొర్లిన నాలాలు, డ్రెయినేజీలు



కాజ్‌వే తూము నుంచి పెద్దచెరువులోకి చేరుతున్న వరద.. నెట్‌లో ఆగిన ప్లాస్టిక్, ఇతర వ్యర్థ వస్తువులు

- జిల్లాకేంద్రంలో భారీ వర్షం
- గల్లీ రోడ్లపైకి వచ్చిన చెత్తాచెదారం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లా కేంద్రంలో గురువారం మధ్యాహ్నం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం గంట పాటు కురిసింది. దీంతో ఓపెన్ నాలాలన్నీ పొంగిపొర్లాయి. లోతట్టు ప్రాంతాల్లో ఎక్కడికక్కడ డ్రెయినేజీలు నిండి గల్లీ రోడ్ల పైకి చెత్తాచెదారం వచ్చింది. ఇక పది విలీన గ్రామాల్లోని మట్టిరోడ్లు బురమయమయ్యాయి. వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కాగా, న్యూటౌన్ వైపున కాజ్‌వే తూము వద్ద నిర్మించిన జాలీ గుండా వరదనీరు పెద్దచెరువులోకి చేరింది. అలాగే దీనికి లోపలి వైపు ఏర్పాటుచేసిన నెట్‌లో మురుగు, ప్లాస్టిక్, ఇతర వ్యర్థమైన వస్తువులు వచ్చి ఆగాయి. అనంతరం వాటిని మున్సిపల్ పారిశుద్ధ్య సిబ్బంది తొలగించారు. ఇక పెద్దచెరువుకు చుట్టూ తవ్విన పెద్దనాలా ద్వారా మురుగు, వరదనీరు సమీపంలోని బీకేరెడ్డి కాలనీ, బీఎస్‌రెడ్డి కాలనీ మీదుగా వెళ్లింది. మరోవైపు రామయ్యబౌలి వద్ద ఉన్న తూము ద్వారా కిందికి వరద నీరు పారింది.



న్యూటౌన్ వైపున పెద్దనాలా ద్వారా జాలీ వద్దకు చేరిన వరద, మురుగు